సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



అచ్చెన్నపై 24 కేసులు

కింజరాపు అచ్చెన్నాయుడుపై 24 కేసులు ఉన్నట్లు తేలింది. ఎన్నికల అఫిడవిట్‌లో ఈ మేరకు పేర్కొన్నారు. - 8లో



32 నామినేషన్లు

సోమవారం 32 నామినేషన్లు పడ్డాయి. ఎంపీ స్థానానికి 4, ఎమ్మెల్యేల స్థానాలకు 28 నామినేషన్లు వేశారు. - 8లో

పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

సారవకోట: రానున్న సాధారణ ఎన్నికల్లో అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు అడిషనల్ ఎస్పీ డాక్టర్ ప్రేమ్ కాజల్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించి ఎన్నికలకు సంబంధించి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎక్కిడికక్కడే చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో పాటు ఎస్ఐ అప్పారావు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన 77 మందికి నోటీసులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇటీవల నిర్వహించిన సాధారణ ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన 77 మంది పీఓ, ఏపీఓ, పోలింగ్ అధికారులపై జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చర్యలు తీసుకున్నారు. ఎన్నికల విధులను తెలియజేసేందుకు ఈనెలలో ప్రిసైడింగ్ ఆఫీసర్(పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఏపీఓ)లకు జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా నిర్వహించిన శిక్షణ తరగతులకు 77 మంది గైర్హాజరవడంతో వారికి నోటీసులు పంపించారు. రెండు రోజుల్లోగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీ రాక కోసం.. మేమంతా సిద్ధం



- సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్న సిక్కోలు జనం
- నేటి సాయంత్రం జిల్లాలోకి ప్రవేశించనున్న బస్సు యాత్ర
- పైడిభీమవరంలో ఘన స్వాగతం పలకనున్న పార్టీ శ్రేణులు
- రణస్థలం, బుడుమూరులో కొనసాగనున్న మేమంతా సిద్ధం యాత్ర
- అక్కివలసలో రాత్రిబస

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సగర్వంగా బస్సు యాత్రకు వస్తున్న సంక్షేమ సారథిని అక్కున చేర్చుకుని.. ఆశీర్వదించేందుకు మేము సైతం సిద్ధం అంటోంది సిక్కోలు ప్రజానీకం. ఆయన రాక కోసం కొండంత ఉత్సాహంతో ఎదురుచూస్తోంది. నాటి ప్రజాసంకల్ప యాత్రను మించి నేటి 'మేమంతా సిద్ధం' యాత్రను విజయవంతం చేసేందుకు సిద్ధమైంది. 22 జిల్లాలు.. 70 నియోజకవర్గాల మీదుగా రోడ్‌షో పూర్తి చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం జిల్లాలోకి ప్రవేశించనున్నారు.

పూసపాటిరేగలో విజయనగరం జిల్లా యాత్ర ముగించుకుని మంగళవారం సాయంత్రం జిల్లాలోకి యాత్ర ప్రవేశించనుంది. పైడి భీమవరంలో అడుగుపెట్టనున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధంగా ఉన్నాయి. అక్కడి నుంచి రణస్థలం, బుడుమూరు మీదుగా అక్కివలసకు యాత్ర చేరుకోనుంది. ముఖ్యమంత్రి అక్కడే రాత్రి బస చేసి బుధవారం జిల్లాలో యాత్ర కొనసాగించనున్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకొచ్చిన ప్రతి సారీ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఓదార్పు యాత్ర సమయంలో అర్ధరాత్రి, తెల్లవారు జాము వరకు వేచి ఉండి మద్దతు పలికారు. ఆయన వెంట నడిచారు. ప్రతిపక్ష నేతగా నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో అడుగులో అడుగులేసి ముందుకుసాగారు. పాదయాత్ర ముగింపు వరకు అభిమాన నేత వెన్నంటే ఉన్నారు. తనను అంతగా ఆదరించిన జిల్లా ప్రజలపై అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంతే అభిమానం చూపారు. జిల్లాలో కీలకమైన ప్రాజెక్టులు పూర్తి చేశారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పలాసలో కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి, ఉద్దానం భారీ మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు, బుడగట్ల పాలెం ఫిషింగ్ హార్బర్, వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఇలా ఒకటేంటి అనేక శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని ప్రగతి దశలో ఉన్నాయి. ఇక, గ్రామాల రూపురేఖలు మారాయి. గ్రామస్థాయిలోనే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వెటర్నరీ క్లినిక్...ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. సంక్షేమమైతే చెప్పనక్కర్లేదు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయి. పేదల జీవితాల్లో మార్పులొచ్చాయి. అందుకనే సంక్షేమ, అభివృద్ధి ప్రదాతగా జిల్లా చరిత్రలో నిలిచిపోయారు. ఇప్పుడా నాయకుడికి బ్రహ్మరథం పట్టేందుకు ఊరువాడా రెడీ అయ్యింది. ఘనస్వాగతం పలికేందుకు పల్లెలన్నీ మేమంతా సిద్ధమంటున్నాయి.

సీఎం బస్సు యాత్ర ఏర్పాట్ల పరిశీలన



మడపాం టోల్‌గేట్ వద్ద బందోబస్తుపై సమీక్షిస్తున్న డీఐజీ విశాల్ గున్నీ

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 24న నిర్వహించనున్న బస్సు యాత్ర ఏర్పాట్లను డీఐజీ విశాల్ గున్నీ, ఎస్పీ రాధికలు సోమవారం సాయంత్రం పరిశీలించారు. మడపాం టోల్‌గేట్ వద్ద ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించా రు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావులకు పలు సూచనలు చేశా రు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మడపాం నుంచి దేవాది, కోమర్తి, సత్యవరం కూడలి మీదుగా తామరాపల్లి, జడూరు కూడలి పై నుంచి టెక్కలి సభా ప్రాంగణానికి చేరుకుంటారని మార్గం మధ్యలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వేడుకగా.. విజయానికి వేదికగా



అభివాదం చేస్తున్న రెడ్డి శాంతి



స్పీకర్ తమ్మినేని అభివాదం

- అభిమాన నేతల నామినేషన్లకు వెల్లువలా తరలివచ్చిన జనం
- ఎండను సైతం లెక్క చేయని వైనం
- వృద్ధులు, మహిళలు అధికసంఖ్యలో హాజరు
- ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని, పలాసలో మంత్రి సీదిరి, పాతపట్నంలో రెడ్డి శాంతి వెంట జననీరాజనం

పార్టీ పతాకాలు రెపరెపలాడాయి. యువ జన శ్రామిక రైతు వర్గాల నినాదాలు నలుదిక్కులా ప్రతిధ్వనించాయి. నాయకుల వెంట సాగిన ర్యాలీలు కిలోమీటర్ల కొద్దీ సాగాయి. సార్వత్రిక సమరానికి సై అంటూ పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం నామినేషన్లు వేశారు. ఆమదాలవలస, పలాస, పాతపట్నంలో తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజు, రెడ్డి శాంతిలు తమ అభిమాన జనం నడుమ అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. జైత్రయాత్రలా సాగిన ఈ వేడుకలు విజయానికి సూచికలా కనిపించాయి. భగ భగ మండిన భానుడు...అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి...రోడ్డు మీదకు రావాలంటేనే హడలి పోయే వాతావరణం ... అభిమానం ముందు ఆ పరిస్థితులన్నీ చిన్నబోయాయి. సుర్రుమన్న ఎండను సైతం లెక్క చేయకుండా వృద్ధులు, యువత, వికలాంగులు అధికసంఖ్యలో హాజరయ్యారు. – సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

పాతపట్నంలో.. కొత్త ఉత్సాహం



పాతపట్నంలో భారీ ర్యాలీ



ఎల్.ఎన్.పేట: వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం నామినేషన్ వేశారు. తొలుత ఆమె పాతపట్నంలోని నీలమణి దుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి క్యాంపు కార్యాలయం నుంచి భారీ ర్యాలీ గా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఎం.అప్పారావుకు అందజేశారు. కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. ఎమ్మెల్యేతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, నర్తు రామారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, పాలవలస ఇందమ్మ పాల్గొన్నారు. –పాతపట్నం, ఎల్ఎన్‌పేట

పలాసలో.. కులాసాగా..





కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలను కలిపే కేటీరోడ్డులో జనసందోహం (ఇన్‌సెట్లో) ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

పలాస శాసన సభ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం రెండు సెట్ల నామినేషన్లను ఎన్నికల అధికారి డాక్టర్ భరత్ నాయక్‌కు అందజేశారు. అలాగే ఆయ న సతీమణి సీదిరి శ్రీదేవి ఒక నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్ జగన్నాథ స్వామి మైదానం నుంచి కేటీ రోడ్డు మీదుగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు మండుతున్న ఎండలో భారీ ర్యాలీ చేశారు. వేలాది మంది అభి మానులతో రోడ్లన్నీ నిండిపోయాయి. –పలాస



నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు

ఆమదాలవలసలో.. ఆత్మీయ గణం



ఆమదాలవలసలో తమ్మినేని వెంట కదిలిన అభిమానులు

టీడీపీకి ఇవి చివరి ఎన్నికలని, ఆ పార్టీని భూస్థాపితం చేద్దామని వైఎస్సార్ సీపీ ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన ఆమదాలవలసలో సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమదాలవలసలో నిర్వహించిన ర్యాలీ హోరెత్తించింది. మండుటెండను లెక్క చేయకుండా వేల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి కుసుమంచివారివీధి రోడ్డులో ప్రధాన రహదారి వరకు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. –ఆమదాలవలస



తహశీల్దారు కార్యాలయంలో ఆర్‌ఓ నవీన్‌కు నామినేషన్ పత్రాన్ని దాఖలు చేస్తున్న తమ్మినేని సీతారాం

టెన్త్ ఫలితాల్లో టాప్ 2

జిల్లా విద్యార్థులు అదరగొట్టారు. టెన్త్ ఫలితాల్లో స్టేట్ సెకండ్ ప్లేస్ సాధించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సర్కారు ఇస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకుని అపురూప ఫలితాలు సాధించారు. కార్పొరేట్ బడులు సైతం అబ్బురపరిచేలా మార్కులు సాధించారు.



శతశాతం ఉత్తీర్ణతతో టాప్‌ప్లేస్‌లో నిలిచిన హిరమండలం కేజీబీవీ

- పది ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన జిల్లా విద్యార్థులు
- 93.35 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రంలో రెండోస్థానం కైవసం
- వరుసగా మూడోసారి ద్వితీయ స్థానం సాధించిన శ్రీకాకుళం
- ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతలో సిక్కోల్ స్టేట్‌ఫస్ట్

శ్రీకాకుళం న్యూకాలనీ: టెన్త్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం వెలువడిన పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఇలా ద్వితీయ స్థానం సాధించడం వరుసగా మూడోసారి కావడం విశేషం. జిల్లా విద్యాశాఖ అధికారులు, యంత్రాంగాన్ని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, పాఠశాల విద్య కమిషనర్ బి.సురేష్‌కుమార్, పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనపై డీఈఓ కె.వెంకటేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాకత్ అలీఖాన్ సంతోషం వ్యక్తం చేశారు.

93.35 శాతం ఉత్తీర్ణతతో..

జిల్లా నుంచి పదో తరగతి పరీక్షలకు మొత్తం 28,745 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కాగా 93.35 శాతం ఉత్తీర్ణతతో 26,833 మంది విద్యార్థులు పాసయ్యారు. ఇందులో 14,712 మంది బాలురు పరీక్షలు రాయగా 91.69 శాతం ఉత్తీర్ణతతో 13,489 మంది పాసయ్యారు. అలాగే 14,033 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా 95.09 శాతంతో 13,344 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలురు కంటే 3.40 శాతం మెరుగ్గా ఉత్తీర్ణత పొందారు.

ప్రథమశ్రేణి ఉత్తీర్ణలో సిక్కోలే టాప్..

ఉత్తీర్ణతలో రెండోస్థానంలో నిలిచిన జిల్లా విద్యార్థులు.. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల జాబితాలో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. జిల్లా నుంచి 26,833 మంది ఉత్తీర్ణులు కాగా.. ఇందులో 23,157 మంది ప్రథమ శ్రేణి(ఫస్ట్‌క్లాస్)లో పాసవడం గమనార్హం. ఈ లెక్కన టెన్త్ పాసైన విద్యార్థుల్లో 86.30 శాతం మంది ప్రథమ శ్రేణిలోనే ఉత్తీర్ణులయ్యారు. ఇక ద్వితీయ శ్రేణిలో 2774 మంది, తృతీయశ్రేణిలో 902 మంది పాసయ్యారు. గత ఏడాది కూడా 80 శాతం ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచింది.

సంక్షేమంలో ఉత్తమ ఫలితాలు - 8లో
ప్రభుత్వ బడులు భేష్ - 8లో

మందస విద్యార్థినికి 596 మార్కులు



భాగ్యశ్రీ పండిట్

కాశీబుగ్గ: మందస జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని భాగ్యశ్రీ పండిట్ 596 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండలంలోని 20 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల కు సంబంధించి 928 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరుకాగా 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఎం.లక్ష్మణరావు తెలిపారు.

చిరు వ్యాపారి కుమార్తెకు 595 మార్కులు



కోటబొమ్మాళి: శ్రీవల్లికి స్వీటు తినిపిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కోటబొమ్మాళి: మండల కేంద్రం కోటబొమ్మాళికి చెందిన సకలాభక్తుల శ్రీవల్లి కోటబొమ్మాళి జెడ్పీ హైస్కూల్‌లో చదివి 595 మార్కులు సాధించి జిల్లాలో ద్వితీయ స్థానం సాధించింది. తండ్రి శ్రీనివాసరావు చిరువ్యాపారి. విద్యార్థినిని ఎంఈఓ-1 ఎస్.అప్పలరాజు, ఎంఈఓ-2 ఎల్.వి.ప్రతాప్, హెచ్‌ఎం డబ్బీరు గోవిందరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆటోడ్రైవర్ కుమార్తెకు 593 మార్కులు



మధుశ్రీతో పాటు ఆమె తల్లిదండ్రులను అభినందిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాసవరపు మధుశ్రీ 593 మార్కులు సాధించింది. ఈమె తండ్రి ఆటో డ్రైవర్ కాగా తల్లి గృహిణి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న ఈమె మేనమామ అవలింగి గ్రామానికి చెందిన మోహనగాంధీ సహకారంతో చదువుకుని ప్రతిభ కనబరిచింది.మధుశ్రీని సారవకోట ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

28న సివిల్ సర్వీస్ పరీక్షలపై యువతకు అవగాహన

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని ఎస్సార్ కన్వెన్షన్‌లో ఈ నెల 28న సివిల్ సర్వీసెస్ పరీక్షలపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించనున్నామని లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఫౌండేషన్ స్థాపించి ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటుచేశామని అన్నారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, యువతకు నైపుణ్యశిక్షణ, మెరిట్ సాధించే పేద బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయడం లక్ష్యంగా ఫౌండేషన్ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 8మంది మెరిట్ విద్యార్థులకు ఢిల్లీలోని నెక్స్ట్ ఐఏఎస్ అకాడమీలో శిక్షణ అందించామని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, వివిధ రంగాలలో ప్రముఖులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

హిందీ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ ద్వారా ఉత్తరాంధ్రా జిల్లాలో జాతీయ భాష హిందీ ప్రచారం చేసేందుకు హిందీ ప్రచార (పరీక్ష) కేంద్రాలను ప్రారంభించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ హిందీ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు సి.ఎల్.నాయుడు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోనె శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, హిందీ పట్టభద్రులు, నిరుద్యోగులు, హిందీ భాషాభిమానులు ఎవరైనా పరీక్షా కేంద్రాలను నెలకొల్పవచ్చని తెలిపారు. అనకాపల్లి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ పాడేరు, శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాల్లో కేంద్రాలను ప్రారంభించడానికి దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ప్రచార కార్యదర్శి 94412 46591 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు సంబంధించి వర్సిటీ పరీక్ష కేంద్రంలో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ మూడు, ఐదేళ్ల డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నారు. ఆర్ట్స్, లా నుంచి 383 మంది, సైన్స్ కోర్సుల నుంచి 314 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య పరిశీలించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కాశీబుగ్గ: రౌతుపురం–నౌపడ రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ లైను ట్రాక్‌పై పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుంది. పలాస వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న రైలు నుంచి ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో జారి పడటంతో 108 అంబులెన్స్‌లో టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

● నామినేషన్ల పర్వం

సోమవారం

32

శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం	4
అసెంబ్లీ స్థానాలు	
పలాస	3
టెక్కలి	2
పాతపట్నం	3
శ్రీకాకుళం	5
ఆమదాలవలస	7
ఎచ్చెర్ల	4
నరసన్నపేట	3
ఇచ్ఛాపురం	1

శ్రీకాకుళం పాత బస్టాండ్: నామినేషన్ల నాల్గో రోజు జోరందుకున్నాయి. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి సోమవారం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. నాయుడుగారి రాజశేఖర్(బీఎస్పీ), పేడాడ పరమేశ్వరరావు(కాంగ్రెస్), పేడాడ చంద్రశేఖర్ ఆజాద్(కాంగ్రెస్), ఎద్దు లక్ష్మీనారాయణ (ఇండిపెండెంట్) నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ స్థానాలకు 28 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇచ్ఛాపురంలో మురపాల లక్ష్మి(ఇండిపెండెంట్), సీదిరి అప్పలరాజు(వైఎస్సార్ సీపీ-2సెట్లు), సీదిరి శ్రీదేవి(వైఎస్సార్‌సీపీ), టెక్కలిలో కింజరాపు అచ్చెన్నాయుడు(టీడీపీ-2 సెట్లు), పాతపట్నంలో కొయ్యాన గోవిందరావు(ఇండిపెండెంట్), రెడ్డి శాంతి(వైఎస్సార్ సీపీ-2 సెట్లు), శ్రీకాకుళంలో గొండు శంకర్(టీడీపీ-2 సెట్లు), గొండు స్వాతి(టీడీపీ), అంబటి కృష్ణారావు(కాంగ్రెస్-2 సెట్లు), ఆమదాలవలసలో సనపల అన్నాజీరావు(కాంగ్రెస్), తమ్మినేని సీతారాం(వైఎస్సార్‌సీపీ-2 సెట్లు), తమ్మినేని వెంకట శ్రీరామ చిరంజీవి నాగ్(వైఎస్సార్‌సీపీ), లాసా సోమేశ్వరరావు(బీఎస్పీ), సనపల సురేష్‌కుమార్ (ఇండిపెండెంట్), గురుగు రేవతి(జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ), ఎచ్చెర్లలో కోనేటి నీలాచలం(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), బర్రి కొర్లయ్య(జైభారత్ నేషనల్ పార్టీ), కరిమజ్జి మల్లేశ్వరరావు(కాంగ్రెస్), కరిమజ్జి రమేష్(కాంగ్రెస్), నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్(వైఎస్సార్‌సీపీ), కాయ కామేశ్వరి(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), మంత్రి నరసింహమూర్తి(కాంగ్రెస్) నామినేషన్లు దాఖలు చేశారు.

ప్రభుత్వ బడులు భేష్



ప్రత్యేక తరగతుల్లో నిమగ్నమైన టెక్కలి మండలం సాకిపల్లి జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు

- టాప్ మార్కులతో ఇరగదీసిన ప్రభుత్వ పాఠశాలల పిల్లలు
- వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 111 సర్కారు బడులు
- ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

శ్రీకాకుళం న్యూకాలనీ:

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అదరగొట్టారు. జిల్లాలో ఏకంగా 111 ప్రభుత్వ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాలో 396 మంది ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల నుంచి 22,360 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 20,536 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 596, 595, 594, 593, 592, 591, 590 వంటి టాప్ మార్కులతోపాటు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు 80 శాతం మంది ఉండటం విశేషం. జిల్లా నుంచి ఎస్ఆర్ఎస్ఎం జెడ్పీహెచ్‌స్కూల్ (ఒరియా), మందసకు చెందిన భాగ్యశ్రీ పండిట్ 596 మార్కులతో టాపర్‌గా నిలిచింది. అలాగే జెడ్పీహెచ్‌స్కూల్ బాలురు, కోటబొమ్మాళికు చెందిన సకలభక్తుల శ్రీవల్లి 595 మార్కులు, జెడ్పీహెచ్‌స్కూల్, అల్లినగరం (ఎచ్చెర్ల మండలం)కు చెందినముని మణికంఠ 594 మార్కులు, జెడ్పీహెచ్‌స్కూల్, బుడితి (సారవకోట మండలం)కు చెందిన 4. మాసవరపు మధుశ్రీ 593 మార్కులు, 592 మార్కులు మరో ఐదుగురు, 591 మార్కులు మరో ముగ్గురు సాధించి శభాష్ అనిపించారు.

ఉన్నతమైన ప్రమాణాలతో విద్య

రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తుండటంతోపాటు నాడు–నేడు సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు అదిరేటి ఫలితాలు సాధించి సత్తాచాటాయి. నాడు–నేడు ద్వారా అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతుల కల్పన, డిజిటల్ విద్యను విద్యార్థులకు చేరువ చేయడం, ఐఎంఎఫ్ ద్వారా పాఠాల బోధన, అధికారుల నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో మంచి ఫలితాలు సాధ్యపడ్డాయి.

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల వారీగా ఫలితాలు ఇలా..

మేనేజ్‌మెంట్ పేరు	పరీక్షకు హాజరు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
ఏపీ మోడల్ స్కూల్స్	1225	1217	99.35
ఏపీరెసిడెన్షియల్ స్కూల్స్	160	160	100
సోషల్ వెల్ఫేర్	560	540	94.43
ట్రైబల్ వెల్ఫేర్	75	75	100
ఎంజేపీ బీసీ వెల్ఫేర్ స్కూల్స్	411	409	99.51
కేజీబీవీ (ఎస్ఎస్ఏ)	986	954	96.75
ఎంపీపీ/జెడ్పీహెచ్ స్కూల్స్	14287	13138	91.96
ప్రభుత్వ స్కూల్స్	2703	2347	86.83
మున్సిపల్ స్కూల్స్	1285	1054	82.02
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్స్	668	639	95.66
మొత్తం:	22360	20536	91.84
ప్రైవేట్ స్కూల్స్	6385	6300	98.67
అన్ని యాజమాన్యాల మొత్తం:	28745	26836	93.35

అదరగొట్టారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యార్థులు టాప్ గేర్‌లో సత్తాచాటారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలతో విజయబావుటా ఎగురవేశారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో అదరగొట్టారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ స్కూళ్లలో మెరిసింది వీరే..

విద్యార్థి	మార్కులు	స్కూల్
భాగ్యశ్రీ పండింట్	596	ఎస్ఆర్ఎస్ఎంజెడ్పీహెచ్‌స్కూల్ (ఒరియా), మందస
సకలభక్తుల శ్రీవల్లి	595	జెడ్పీహెచ్‌స్కూల్ బాలురు, కోటబొమ్మాళి
ముని మణికంఠ	594	జెడ్పీహెచ్ స్కూల్, అల్లినగరం (ఎచ్చెర్ల మండలం)
మాసవరపు మధుశ్రీ	593	జెడ్పీహెచ్‌స్కూల్, బుడితి (సారవకోట మండలం)
నెయ్యల దుష్యంత్	592	ఎస్ఆర్ఎస్ఎంజెడ్పీహెచ్‌స్కూల్(ఒరియా), మందస
హడియ సిద్ధు	592	జెడ్పీహెచ్‌స్కూల్(ఒరియా) కృష్ణాపురం (మందస మండలం)
గాయత్రి పండా	592	ఎస్ఆర్ఎస్ఎంజెడ్పీహెచ్‌స్కూల్(ఒరియా), మందస
మామిడి సోనియ	592	జెడ్పీహెచ్‌స్కూల్ కొసమల, (మెళియాపుట్టి మండలం)
మేఘన మహారాణా	592	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పలాస
గుజ్జు శ్రీహర్ష	591	ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ బాలురు, ఎస్ఎం పురం
కవి శిరీష	591	ఏపీ మోడల్ స్కూల్ కొండములగాం (రణస్థలం మండలం)
ఎం.శ్రీశ్రావ్యఅమృత	591	ఏపీ మోడల్ స్కూల్, సోంపేట

ప్రైవేటు స్కూళ్లలో సత్తాచాటింది వీరే..

1.సంపతిరావు శ్రీకర్ 597 (శ్రీచైతన్య కాశీబుగ్గ), 2. తమ్మినైన శ్రీనిఖిత 596 (కేశవరెడ్డి, ఎచ్చెర్ల), 3.అంధవరపు శిరీష 596 (రవీంద్రభారతి, పాతపట్నం), 4.బుడుమూరు స్ఫూర్తి 595 (శ్రీచైతన్య శ్రీకాకుళం), 5.తమ్మాన శ్రీవాని 595 (శ్రీచైతన్య బలగ), 6. సనపల సౌమ్య 595 (నారాయణ నరసన్నపేట), 7.దొక్కర శ్రీవల్లి 595 (శ్రీచైతన్య, కాశీబుగ్గ), 8. సాయిహర్షవర్ధన్ పట్నాయక్ 595 (శ్రీచైతన్య, కాశీబుగ్గ), 9. సీహెచ్ వేదవ్యాస్ 595 (నారాయణ స్కూల్ కంటికోట), 10. వాశెట్టి శివాని 595 (జెఎంజెహైస్కూల్ కంచిలి), 11. కొవ్వాడ స్మృతి 595 (మహర్షి విద్యాలయం కొత్తూరు)

ప్రభుత్వ బడులు గర్వకారణంగా నిలుస్తున్నాయి



ప్రభుత్వ బడులు గర్వకారణంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక కార్యక్రమాలు, నాడు–నేడు ద్వారా వసతులు, సౌకర్యాలు, సంక్షేమ పథకాలు, ప్రమాణాలతో కూడిన విద్యను రాష్ట్రప్రభుత్వం అందిస్తుంది. రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచినందుకు సంతోషంగా ఉంది.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ శ్రీకాకుళం

సంక్షేమంలో ఉత్తమ ఫలితాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.

- జిల్లా వెనుక బడిన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 58 సంక్షేమ వసతి గృహాల నుంచి 978 మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 920 మంది ఉత్తీర్ణులయ్యారు.
- పాసైన వారిలో ప్రథమ శ్రేణిలో 759 మంది, ద్వితీయ శ్రేణిలో 123, తృతీయ శ్రేణిలో 38 మంది ఉన్నారు. 58 మంది పరీక్షల్లో తప్పారు. వీరి ఉత్తీర్ణత శాతం 94.07గా నమోదైంది. పాసైన వారిని, వసతి గృహం అధికారులను జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఇ.అనురాధ అభినందించారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 96.42 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది పదో తరగతిలో 12 రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి 560 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హజరుకాగా వీరిలో 540 మంది ఉత్తీర్ణులయ్యారు. 20 మంది పరీక్షలు తప్పారు.
- పెద్దపాడు గురుకుల విద్యార్థిని ఎ.దీపిక 582 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు రావడంపై బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.బాలాజీ అభినందనలు తెలిపారు.
- జిల్లాలోని 20 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 257 మంది టెన్త్ పరీక్షలకు హాజరు కాగా వీరిలో 246 మంది ఉత్తీర్ణులయ్యారు. 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. సోంపేట బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థిని కె.స్వాతి 554 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఉత్తమ ఫలితాలు రావడంపై సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి సంక్షేమ వసతి గృహ అధికారును, విద్యార్థులను అభినందించారు.

పరీక్ష ఫెయిలయ్యానని టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న జానకి అలియాస్ గాయత్రి

కోటబొమ్మాళి: మండలంలోని విశ్వనాథపురం పంచాయతీ సీతారాంపురం గ్రామానికి చెందిన వజ్రగడ్డి జానకి అలియాస్ గాయత్రి (16) సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. టెన్త్ క్లాస్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

సీతారాంపురానికి చెందిన వజ్రగడ్డి సరోజనమ్మ, రామారావు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రామారావు ఏడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. పెద్ద కుమార్తె మంజులత డిగ్రీ చదువుతోంది. రెండో కుమార్తె జానకి నందిగాం గురుకుల పాఠశాలలో చదువుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసింది. పరీక్ష ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. జానకి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. గ్రామంలో వారు కొత్తగా నిర్మించిన ఇంటికి వెళ్లి వస్తానని తల్లి సరోజనమ్మకు చెప్పింది. కొంతసేపటికి జానకి స్నేహితులు వచ్చి జానకి ఎక్కడుందని తల్లిని అడుగగా, కొత్త ఇంటి వద్ద ఉందని బదులిచ్చింది. దీంతో స్నేహితులు వెళ్లి చూస్తే విద్యార్థిని ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే వారు తల్లికి సమాచారం అందజేశారు. అందరితో కలివిడిగా ఉండే జానకి మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

అచ్చెన్నపై 24 కేసులు

టెక్కలి: టెక్కలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడుపై 24 కేసులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్, ఈఎస్ఐ కుంభకోణం కేసుల్లో భాగంగా ఏసీబీ, సీఐడీ కోర్టుల్లో అచ్చెన్న పై కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అంతే కాకుండా అచ్చెన్నాయుడు వద్ద తుపాకీ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, పోలీసులపై దురుసుగా ప్రవర్తించి వారి విధులకు భంగం కలిగించడం, శాంతి భద్రతలకు విఘాతం, హింసాత్మక చర్యలు కలిగించే విధంగా వివిధ సంఘటనల్లో భాగస్వామ్యం కావడంతో అచ్చెన్న పై కేసులను నమోదు చేసినట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల్లో ఆస్తుల విషయానికి వస్తే...అచ్చెన్న పేరుతో స్థిరాస్తులు రూ.2,31,48,500, భార్య విజయమాధవి రూ.6,13,56,00, పెద్ద కుమారుడు కృష్ణమోహన్‌నాయుడు పేరిట రూ.1,34,55,000, చిన్న కుమారుడు తనూజ్‌నాయుడు పేరిట రూ.72,00,000 గా చూపించారు. అచ్చెన్న పేరిట చరాస్తులు రూ.1,32,05,511, భార్య పేరిట రూ.4,68,27,569, పెద్ద కుమారుడి పేరిట రూ.28,46,056, చిన్న కుమారుడి పేరిట రూ.31,52,122 గా చూపించారు. అప్పుల విషయానికి వస్తే.. అచ్చెన్నకు రూ.42,90,153, భార్యకు రూ.3,36,50,000 అప్పులు ఉన్నట్లు చూపించారు. అచ్చెన్న వద్ద చేతి నగదు కింద రూ.2,50,000, భార్య వద్ద రూ.5,00,000, పెద్ద కుమారుడి వద్ద రూ.2,00,000 ఉన్నట్లు చూపించారు. అచ్చెన్న పేరిట రాష్ట్ర వ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో రూ.64,18,869 ఉన్నట్లు చూపించారు. వీటితో పాటు సుమారు రూ.49,26,819 విలువైన ఇన్సూరెన్స్‌లు ఉన్నాయి. భార్య విజయమాధవి పేరిట శ్రీ ఇన్‌ఫ్రా జేవీ సంస్థలో రూ.67 లక్షల పెట్టుబడులు, కాపీశ్వర్ ప్రాపీ సంస్థలో రూ.43 లక్షల పెట్టుబడులు, హెచ్‌జీకే సంస్థలో రూ.96,47,960 పెట్టుబడులు, హైదరాబాద్‌లో వెంగమాంబ హోటల్స్ అండ్ రిసార్ట్స్‌లో రూ.30 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు చూపించారు. పెద్ద కుమారుడి పేరిట శ్రీకృష్ణ లలిత డెవలపర్స్‌లో రూ.22 లక్షల పెట్టుబడులు ఉన్నాయి. భార్య పేరిట ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రాంతాల్లో వివిధ బ్యాంకుల్లో సుమారు రూ.59,60,845 డిపాజిట్లు ఉన్నట్లు చూపించారు. అచ్చెన్న వద్ద రూ.14.50 లక్షల విలువైన 210 గ్రాముల బంగారం, భార్య వద్ద రూ.85,75,000 విలువైన 1255 గ్రాముల బంగారం, 7,20,000 విలువైన డైమండ్స్ ఉన్నాయి. అంతే కాకుండా భార్య పేరుతో రూ. 3 లక్షల విలువైన ఇన్నోవా క్రిస్టా వాహనం ఉంది. నిమ్మాడ, హరిశ్చంద్రాపురం, చిట్టివలస తదితర గ్రామాల్లో అచ్చెన్న పేరుతో సుమారు రూ.1,61,48,500 విలువైన వ్యవసాయ భూములు ఉన్నాయి. భార్యకు రణస్థలం, శ్రీకాకుళం, నరసన్నపేట ప్రాంతాల్లో సుమారు రూ.1,92,20,000 విలువైన వ్యవసాయ భూములు ఉన్నాయి. చిట్టివలస వద్ద భవానీ ఫామ్స్ లో సుమారు రూ.86 లక్షలు విలువైన భాగస్వామ్యం ఉంది. భార్య పేరుతో సుమారు రూ.1,13,36,000 విలువైన వ్యవసాయేతర భూములు ఉన్నాయి. కుమారుల పేరుతో రూ.1,58,55,000 విలువైన వ్యవసాయేతర భూములు ఉన్నాయి. వివిధ చోట్ల కమర్షియల్ భవనాల్లో భార్య పేరుతో కోట్లాది రూపాయల షేర్లు ఉన్నాయి. అంతే కాకుండా అచ్చెన్న తో పాటు భార్య పేరిట సుమారు రూ.2.28 కోట్ల రూపాయల విలువైన భవనాలు ఉన్నాయి. అయితే అచ్చెన్నాయుడు కంటే భార్య పేరుతో అత్యధికంగా ఆస్తులు ఉండడం గమనార్హం.

సీఎం సభను విజయవంతం చేద్దాం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్. పక్కనే కాయల వెంకటరెడ్డి తదితరులు

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర బుధవారం టెక్కలిలో ముగుస్తున్న సందర్భంగా సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం టెక్కలిలో నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విస్తతంగా ప్రచారం నిర్వహించి అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, సర్పంచ్ జి.సుజాత, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పి.వసంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు కె.అజయ్, కె.సతీష్, ఎస్.సత్యరాజ్, టి.పాల్గుణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు సత్తారు సత్యం, కె.గోవింద్, నాయకులు ఆర్.మల్లయ్య, పి.రమేష్, జి.గురునాథ్‌యాదవ్, ఎస్.హేమసుందర్‌రాజు, ధవళ కృష్ణ, పి.హేమలత, ఎస్.మోహన్, వి.శ్రీధర్‌రెడ్డి, ఆర్.జయమోహన్, ఆర్.మురళీరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

బావిలోకి దూకి వృద్ధుడు ఆత్మహత్య

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని శివనగర్ కాలనీ కసవమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న బావిలోకి దూకి రేసు లక్ష్మణరావు(65) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నరసన్నపేట ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నామని చెప్పారు. సోమవారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశామన్నారు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఆత్మహత్యగా భావించి కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు. మృతికి గల కారణాలు తెలియలేదు.

వెల్లువలా చేరికలు



రణస్థలం: వైఎస్సార్‌సీపీలో చేరిన లావేటిపాలెం గ్రామస్తులతో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



శ్రీకాకుళం రూరల్: ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన పేర్లవానిపేట మత్స్యకారులు

శ్రీకాకుళం రూరల్: రాష్ట్రం బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. సోమవారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో 19వ డివిజన్ ఇన్‌చార్జి బిర్లంగి మోహన్‌రావు, గొప్పు సంతోష్ ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, సంజీవరావు, కృష్ణారావు, దుర్గాప్రసాద్, మురళీమోహన్, గోవిందరావు, ధర్మారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో లావేటిపాలెం గ్రామానికి చెందిన 300 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమకు బీజేపీ నాయకులు బలవంతంగా కండువా వేశారని చెప్పారు. తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో లావేరు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: గార మండలం పేర్లవానిపేటకు చెందిన పలువురు మత్స్యకారులు పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ చీకటి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేర్ల శ్రీరాములు, కుందు పోలయ్య, పేర్ల రాంబాబు, చీకటి శ్రీరామ్మూర్తి, సూరాడ సూర్యం, ఫల్గుణరావు, కోనాడ నర్సింగరావు, మైలపల్లి పోలీసు తదితరుల పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని ఆకాశలక్కవరం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుగ్గు కామేశ్వరరావు, దీర్ఘాశి పాపయ్య, దీర్ఘాశి కన్నయ్య, కుప్పిలి రాజేష్, దీర్ఘాశి ఎర్రయ్య ఉన్నారు.



శ్రీకాకుళం రూరల్: ధర్మాన సమక్షంలో పార్టీలో చేరిన 19వ డివిజన్ కార్యకర్తలు



సంతబొమ్మాళి: పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పేరాడ తిలక్, కాయల వెంకటరెడ్డి